క్లుప్తంగా

నూతన బస్టాండ్ ప్రారంభం

పినపాక: మండల పరిధిలోని జానంపేట గ్రామంలో నిర్మించిన నూతన బస్టాండ్‌ను గురువారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. గ్రామస్తులు రోడ్డుపైకి వచ్చి ఆటో, బస్సు కోసం ఎదురుచూస్తున్న సమయంలో ఎండ, వాన నుంచి రక్షణకు స్థానిక రైతులే ఈ బస్టాండ్ నిర్మించినట్లు తెలిపారు. వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఎస్సై రాజ్‌కుమార్, కాంగ్రెస్ నాయకుల పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

కరకగూడెం: మండల పరిధిలోని రేగళ్ల ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు గురువారం కొల్లి ఫౌండేషన్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో భట్టుపల్లి కాంప్లెక్స్ హెచ్ఎం మోహన్ బాబు చేతుల మీదుగా సుమారు 36 మందికి 150 నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రస్ట్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ రూప్లా నాయిక్, సభ్యులు శంకర్, పాఠశాల హెచ్ఎం వీరన్న, ఉపాధ్యాయులు సుజాత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయుడికి వీడ్కోలు

దుమ్ముగూడెం: మండలంలోని దబ్బనూతుల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించి బట్టిగూడెం బదిలీ అవుతున్న రాంబాబుని దబ్బనూతుల యూత్ ఐకాన్ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఆ స్థానంలో నూతన ఉపాధ్యాయురాలిగా వచ్చిన సౌందర్యని శాలువాతో సత్కరించి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సోందె నాగరాజు, జంపన్న, కుర్సం వేణు, కుర్సం నవీన్, సోందె నర్సింహారావు, చిట్టిబాబు, సోందె నవీన్, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

భద్రాచలంఅర్బన్: పీడీఎస్‌యూ అర్ధ శతాబ్దం పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేయనున్న సభల పోస్టర్లను సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గొని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూర్యాపేట జిల్లా కేంద్రంలో అక్టోబర్ 4న, హైదరాబాద్‌లోని ఠాగూర్ ఆడిటోరియం, ఉస్మానియా యూనివర్సిటీలో 24న జరిగే పీడీఎస్‌యూ అర్ధ శతాబ్దోత్సవ సభలను జయప్రదం చేయాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు ప్రణయ్ కుమార్, ఇరుప రాజేష్, పూర్వ ఖమ్మం జిల్లా నాయకులు ముసలి సతీష్, రాంబాబు, శ్రీను, ముత్యంతోపాటు ప్రస్తుత విద్యార్థులు చంద్రశేఖర్, శివశివాని, హిమగీతిక, పాషా పాల్గొన్నారు.

21 నుంచి ఐద్వా మహాసభలు

బూర్గంపాడు: ఈ నెల 21, 22, 23 తేదీల్లో కొత్తగూడెంలో జరుగనున్న ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎంబి.నర్సారెడ్డి కోరారు. సారపాకలో గురువారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఐద్వా రాష్ట్ర మహాసభల్లో మహిళల సమస్యలు, పరిష్కారాల కోసం చేపట్టనున్న ఉద్యమాలపై భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, బండారు శరత్ బాబు,పాపినేని సరోజని, ఎస్‌కె.అబీదా, కనకం వెంకటేశ్వర్లు, కృష్ణ పాల్గొన్నారు.

పెసా ఆధ్వర్యంలోనే కమిటీలు వేయాలి

అశ్వారావుపేటరూరల్: ఏజెన్సీ ప్రాంతంలో 'పెసా'కమిటీ ఆధ్వర్యంలోనే ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను వేయాలని జిల్లా ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం జిల్లా అధ్యక్ష్య, కార్యదర్శులు సోమిని శివశంకర ప్రసాద్, తాళ్ల దుర్గయ్య డిమాండ్ చేశారు. మండలంలోని వేదాంతపురం గ్రామంలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి ఇందిరమ్మ కమిటీలను ఎంపిక చేయాల్సి ఉండగా, ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఏజెన్సీ పంచాయతీల్లో ఎస్టీ నాయకపోడు సామాజిక వర్గానికి కనీసం అవకాశం ఇవ్వడం లేదని విమర్శించారు. తక్షణమే గ్రామసభలు నిర్వహించాలన్నారు.

బిక్షం మృతి సీపీఎంకు తీరని లోటు

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక గ్రామానికి చెందిన సీపీఎం కార్యకర్త బిల్లా చిన్న బిక్షం మృతి పార్టీకి తీరని లోటని సీపీఎం సీనియర్ నాయకులు యలమంచిలి రవికుమార్ అన్నారు. గురువారం అనారోగ్యంతో మరణించిన బిల్లా చిన్న బిక్షం భౌతిక కాయనికి పూలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. పార్టీలో ఆయన అనేక ఉద్యమాల్లో ముందున్నారని గుర్తు చేశారు. పార్టీ మండల కార్యదర్శి కారం పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ, నాయకులు బోల్లి సూర్యచంద్రరావు, బోల్లి సత్యనారాయణ,కుమరికుంట్ల సాంబశివరావు, సాయిబాబు, ప్రమీల, అజ్మీర రాము, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై మృత్యు కేకలు

- కనిపించని వేగ నిరోధకాలు
- తరచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- గాలిలో కలుస్తున్న ప్రాణాలు.. పట్టని అధికారులు


నారంవారిగూడెం వద్ద ఢీకొన్న రెండు లారీలు (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: ఆ జాతీయ రహదారి మృత్యు కేంద్రంగా మారింది. అయినా సరే ఎన్‌హెచ్ (నేషనల్ హైవే) అధికారులకు, స్థానిక పోలీస్ శాఖకు కనీసం పట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్డు ప్రమాదాలకు కేంద్రంగా మారిన ఆ ప్రాంతంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ దారిలో ఇప్పటికే పదుల సంఖ్యలో క్షతగాత్రులు కాగా, ఇంకొంతమంది ప్రాణాలు గాల్లో కలిశాయి. అశ్వారావుపేట–సత్తుపల్లి జాతీయ రహదారిలో నారంవారిగూడెం నుంచి స్టేజీ నుంచి కొబ్బరి విత్తనోత్పత్తి క్షేత్రం వరకు మృత్యు కేంద్రంగా మారింది. ఈ ప్రాంతంలో గడిచిన ఆరు నెలల కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృత్యువాత పడ్డారు. సుమారు 30 మంది వరకు క్షతగాత్రులయ్యారు. వీరిలో తీవ్ర గాయాలతో కొంతమంది, స్వల్ప గాయాలతో మరికొంత మంది ఆస్పత్రుల పాలయ్యారు. నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిన ఆ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు కనీసం హెచ్చరికా బోర్డులు కానీ, వేగ నిరోధాకాలు కానీ ఏర్పాటు చేయడం లేదు. దీంతో వాహనదారులు మితిమీరిన వేగంతో వస్తుండగా, ఎదురుగా వచ్చే వాహనాలు, ఆగి ఉండే వాహనాలను అదుపు తప్పి ఢీకొట్టుతున్నాయి. దాంతో అమాయకుల ప్రాణాలు గాల్లో కలుస్తుండగా, వాహనాలు సైతం నుజ్జునుజ్జవుతున్నాయి.

ఈ మార్గంలో ఇటీవలె కురిసిన వర్షాలకు జాతీయ రహదారిపై గుంతలు పడ్డాయి. ఈ గుంతలు కూడా ప్రమాదకరంగా మారాయి. గుంతలు పడిన చోట ప్యాచ్ వర్క్ చేయడంలో ఎన్‌హెచ్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నట్లు వాహనదారులు వాపోతున్నారు.

ప్రమాద ఘటనలు ఇలా..

- కొబ్బరి విత్తనోత్పత్తి క్షేత్రం నుంచి నారంవారిగూడెం వరకు గడిచిన ఆరు నెలల కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు దుర్మరణం చెందారు. అలాగే ప్రయాణికులు, కూలీలు, వాహనదారులు, పాదాచారులంతా కలిపి సుమారు 25 మంది దాకా గాయపడ్డారు. వీరిలో కాళ్లు, చేతులు విరిగిపోయిన వారు, ఇంకా మంచాలకే పరిమితం అయిన వారు ఉన్నారు.
- ఈ ఏడాది జూన్ 10వ తేదీన నారంవారిగూడెం సమీపంలో ఆగి ఉన్న లారీను వేగంగా దూసుకొచ్చిన డీసీఎం వ్యాను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఖమ్మం జిల్లా కల్లూరుకు చెందిన కోలా నరసింహారావు(38) తీవ్రంగా గాయపడి, 14వ తేదీన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.
- జూన్ 14వ తేదీన నారంవారిగూడెం (శ్రీరంగాపురం) వద్ద ఉన్న విజయదుర్గ అమ్మవారి ఆలయం దగ్గర అశ్వారావుపేట నుంచి వేగంగా దూసుకొచ్చిన లారీ కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడగా, మరో 19 మంది కూలీలు గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. ఈ ప్రమాదంలో గాయపడిన మరో ఇద్దరు నడుము భాగం దెబ్బతిని ఇప్పటికీ మంచాలకే పరిమితమయ్యారు.
- జూన్ 15వ తేదీ తెల్లవారుజాము సమయంలో ఇదే ప్రాంతంలో ఎదురెదురుగా వచ్చిన రెండు లారీలు ఢీ కొట్టుకున్నాయి. ఈ ఘటనలో ఏపీలోని ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన సుంకే రమేష్(40) అనే లారీ డ్రైవర్ అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. మరో లారీ డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి.
- ఈ ఏడాది జూలై 19వ తేదీన ఆర్టీసీ బస్సు, కారు ఢీ కొన్న ఘటన సైతం ఈ మార్గంలో జరిగింది.

ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు, కారు ఢీ కొన్న ఘటనలో బస్సు అదుపు తప్పి రహదారి పక్కనే ఉన్న గుంతలోకి దూసుకెళ్లి ఆగిపోగా.. కారు ముందు భాగం దెబ్బతిన్నది. కాగా, ఆర్టీసీ బస్సులో ఉన్న ఐదుగురు ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

బారికేడ్లు ఏర్పాటు చేస్తాం..



నారంవారిగూడెం–కొబ్బరి విత్తనోత్పత్తి క్షేత్రం మధ్యలో జాతీయ రహదారి ప్రమాదకరంగా ఉన్న మాట వాస్తవమే. ఇప్పటికే రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతుండటాన్ని గుర్తించాం. బారికేడ్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాం. త్వరలోనే ప్రమాదకరంగా ప్రదేశాల్లో బారికేడ్లను చేస్తాం.
– యయాతి రాజు, ఎస్సై, అశ్వారావుపేట

అంగన్‌వాడీల ధర్నా, వినతి


దమ్మపేట: ఐసీడీఎస్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

అశ్వారావుపేటరూరల్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో అశ్వారావుపేట సీడీపీఓ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి జి.పద్మ మాట్లాడుతూ.. అప్‌గ్రేడ్ చేసిన మినీ అంగన్‌వాడీ టీచర్లకు పూర్తి వేతనం ఇవ్వాలని, అలాగే కనీస వేతనాన్ని రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏలు ఇవ్వాలన్నారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని సూపర్‌వైజర్‌కు అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ బాధ్యులు రాధా, కృష్ణవేణి, రాజేశ్వరి, లక్ష్మి, వెంకట రమణ పాల్గొన్నారు.

దమ్మపేట: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి పద్మ మాట్లాడుతూ.. అప్‌గ్రేడ్ అయిన మినీ అంగన్‌వాడీ టీచర్లకు ఇప్పటికీ పూర్తి వేతనాలు చెల్లించలేదని అన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లించి, ఆరోగ్య భద్రతతో పాటుగా పదవి విరమణ ప్రయోజనాలను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సూరమ్మ, జ్యోతి, జయ, స్రవంతి, రమణ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

చర్ల: మినీ అంగన్‌వాడీ కేంద్రాల నుంచి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలకు పదోన్నతి పొందిన అంగన్‌వాడీ టీచర్లందరికీ పూర్తి జీతాన్ని చెల్లించాలని సీఐటీయూ నాయకురాలు స్వరూప డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం చర్లలోని ఐసీడీఎస్ కార్యాలయం ముందు తెలంగాణా అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు ఆందోళన నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఏ చైతన్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

జడ్జి దంపతులకు సన్మానం

దమ్మపేట: మండల కేంద్రంలోని కోర్టులో జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేసి సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొందిన బత్తుల రామారావు దంపతులను, దమ్మపేట బార్ అసోసియేషన్ తరపున గురువారం ఘనంగా సన్మానించారు. న్యాయవాదులు శాలువాతో సత్కరించి, మోమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా జడ్జి రామారావు మాట్లాడుతూ.. దమ్మపేట కోర్టులో తనకు సహాయ సహకారాలు అందించిన కోర్టు సిబ్బంది, న్యాయవాదులు, పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మారం సతీష్‌కుమార్, గొంది మురళీమోహన్, ఉడతనేని శ్రీను, శ్యాంసుధాకర్, లక్కినేని నరేంద్ర, భవానీ కృష్ణ, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.


దమ్మపేట బార్ అసోసియేషన్ సభ్యులతో జడ్జి బత్తుల రామారావు దంపతులు

వాల్మీకి గాథ స్ఫూర్తిదాయకం

మణుగూరుటౌన్: రత్నాకరుడిగా పుట్టి పెరిగిన వాల్మీకి జీవిత గాథ ఎంతో స్ఫూర్తిదాయకమని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. గురువారం మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భక్తి భావంతో వాల్మీకి 24వేల శ్లోకాలు ఆరు ఖండాలుగా పరమపావనమైన రామాయణాన్ని దేవనగరి లిపిలో రచించారన్నారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులు శ్యాం సుందర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రమేష్, అనురాధ, శ్రీనివాసమూర్తి, శైలేందర్ కుమార్, ఎస్‌ఓ శ్రీనివాస్, జే. శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్ వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ మధు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: శ్రీ మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని తూర్పు బజారులోగల శ్రీ మహర్షి వాల్మీకి ఆలయంలో వాల్మీకి సంఘం బాధ్యులు ముసికి వెంకట రమణ ఆధ్వర్యంలో పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు.


వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏరియా జీఎం దుర్గం రాంచందర్


అశ్వారావుపేటరూరల్: విగ్రహానికి పూలమాల వేస్తున్న వాల్మీకి సంఘం బాధ్యుడు రమణ

నేడు గ్రామసభ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని సీతారామచంద్ర స్వామి దేవస్థానం అభివృద్ధి పనులకు సంబంధించి భూసేకరణ నిమిత్తం నేడు పెసా గ్రామ సభను మధ్యాహ్నం 12 గంటలకు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పంచాయతీ ఈఓ శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భద్రాచలం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎజెండాకు సంబంధించిన అంశంలో తమ అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. భద్రాచలం ఐటీడీఏ పీఓ, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి రాహుల్ సభలో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

ఏఈకి సన్మానం

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ జల్లిపల్లి మహేష్ బదిలీ అయిన సందర్భంగా ఆయనను కార్యాలయ సిబ్బంది, గ్రామస్తులు గురువారం శాలువాతో సన్మానించారు. మండలంలో ఏఈగా ఎనిమిది సంవత్సరాలుగా విధులు నిర్వర్తిస్తున్న మహేష్.. సాధారణ బదిలీల్లో భాగంగా భద్రాచలం ట్రాన్స్‌ఫార్మర్స్ ఏఈగా బదిలీ అయ్యారు. ఆయన మండల పరిధిలో చేసిన సేవలను గ్రామస్తులు కొనియాడారు.

నూతన కమిటీ ఎన్నిక

అశ్వాపురం: ఐద్వా నూతన మండల కమిటీని గురువారం ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో సీఐటీయూ కార్యాలయంలో కొప్పుల పద్మ అధ్యక్షతన జరిగిన ఐద్వా మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాయం విజయ, కార్యదర్శిగా మండెపూడి శామంతకమణి, కోశాధికారిగా కొప్పుల పద్మతో పాటు 9 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ మహాసభలో కుంజా లక్ష్మి, పాయం రత్నకుమారి, పాయం వెంకటమ్మ, మోకాళ్ల తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

చండీహోమం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో చండీహోమాన్ని వైభవంగా నిర్వహించారు. గురువారం పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయంలోని స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ హోమశాలలో అర్చకులు చండీహోమాన్ని జరిపించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని, తీర్థప్రదాలను స్వీకరించారు.

సొసైటీ అభివృద్ధికి సహకరించాలి

అశ్వాపురం: నెల్లిపాక సహకార సంఘం అభివృద్ధికి రైతులు సహకరించాలని సంఘం అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామంలోని నెల్లిపాక సహకార సంఘం కార్యాలయంలో గురువారం మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన మహాజన సభ సమావేశం నిర్వహించారు. సంఘం సభ్యులు పలు సమస్యలు, సంఘం బలోపేతంపై మాట్లాడారు. పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. సంఘం సీఈఓ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ కమటం సురేష్, డైరెక్టర్లు, మాజీ అధ్యక్షులు మర్రి మల్లారెడ్డి, కమటం వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో షాపుల తొలగింపు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఐటీడీఏ రోడ్డులో ప్రభుత్వ స్థలాలను, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న దుకాణాలకు గ్రామ పంచాయతీ అధికారి శ్రీనివాసరావు గురువారం జేసీబీ సహాయంతో తొలగించారు. భద్రాచలం పట్టణంలో ప్రభుత్వ స్థలాలను ఫూట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న దుకాణాలకు సంబంధించి ఈ నెల 10వ తేదీన 'పాదచారికి దారేది..?'అనే కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన అధికారులు ప్రస్తుతం ఐటీడీఏ రోడ్డులో చర్యలు చేపట్టగా.. రానున్న రోజుల్లో ఇలాంటి కార్యక్రమాలను వేగం పెంచనున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ స్థలంలో ట్రాన్స్‌ఫార్మర్..

కాగా భద్రాచలం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రోడ్డులోని ఓ షాపింగ్ మాల్ నిర్వాహకులు తమకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పంచాయతీ స్థలంలోని ఏర్పాటు చేసుకున్నారు. ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి తొలగించాల్సిందిగా విద్యుత్ అధికారులు రెండు సార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ యాజమాన్యం ససేమీరా అంటున్నట్లు సమాచారం. ఇలాంటి ఆక్రమణలపైనా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోనున్నారా అని స్థానికులు చర్చకు తెరలేపారు.


ఫుట్‌పాత్‌పై దుకాణాలను తొలగిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

గ్రంథాలయానికి ఫ్యాన్లు వితరణ


ఫ్యాన్లు, కుర్చీలను లైబ్రేరియన్ జానీకి అందజేస్తున్న దృశ్యం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని తాతగూడి సెంటర్‌లో ఉన్న గ్రంథాలయానికి గురువారం జీవన్ ఆస్పత్రి నిర్వాహకుడు చల్లగుళ్ల నాగేశ్వరరావు రెండు సీలింగ్ ఫ్యాన్లు, రెండు కుర్చీలను వితరణగా అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఔషధ నియంత్రణ అధికారి సంపత్ పాల్గొని గ్రంథాలయం లైబ్రేరియన్ జానీకి అందజేశారు. ఆస్పత్రి నిర్వహకులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పరిమి సోమశేఖర్, భద్రాచలం కెమిస్ట్ అండ్ డ్రగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశవ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో ఖాళీ పోస్టులు భర్తీ


బాధ్యతలు చేపట్టిన ఏడీఈ వెంకటరత్నం

అశ్వారావుపేటరూరల్: గడిచిన కొద్ది నెలలుగా విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులు ఎట్టకేలకు భర్తీ అయ్యాయి. బదిలీలపై వచ్చిన ఉద్యోగులు స్థానిక కార్యాలయాల్లో గురువారం బాధ్యతలు స్వీకరించారు. కొత్తగూడెం సెక్షన్ ఆఫీసులో టెక్నికల్ ఏడీఈగా పని చేస్తున్న వి.వెంకటరత్నం అశ్వారావుపేట ఏడీఈగా, ఇల్లెందు (రూరల్)ట్రాన్స్‌కో ఏఈఈగా పని చేస్తున్న రవి అశ్వారావుపేట ఏఈఈగా బాధ్యతలు చేపట్టారు. అలాగే దమ్మపేట లైన్‌మెన్‌గా పని చేస్తున్న రాంకుమార్ అశ్వారావుపేటకు, ఇక్కడ లైన్‌మెన్‌గా పని చేస్తున్న గంటా వెంకటేశ్వరరావు దమ్మపేటకు, అదే విధంగా దమ్మపేట లైన్‌మెన్‌గా పని చేస్తున్న తాటి ప్రసాద్ వినాయకపురం లైన్‌మెన్‌గా, వినాయకపురం లైన్‌మెన్ చంద్రశేఖర్‌కు అచ్యుతాపురం లైన్‌మెన్‌గా వచ్చారు. వీరంతా ఆయా కార్యాలయాల్లో విధుల్లో చేరారు. దీంతో విద్యుత్ శాఖలో నెలకొన్న ఉద్యోగుల కొరత సమస్య కొంత మేర తీరింది.

కుమురం భీం విగ్రహావిష్కరణకు ఆహ్వానం


ఎమ్మెల్యే వెంకట్రావుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నాయకులు

భద్రాచలంఅర్బన్: ములుగు జిల్లా ఏటూరు నాగారం సమీపాన ఆకులవారి ఘనపురంలో ఈనెల 24న కుమురం భీం విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు ఆదివాసీ సంఘాల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా భద్రాచలంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు గురువారం ఆహ్వానపత్రిక అందజేశారు. ఆదివాసీ సంఘాల సమన్వయ జేఏసీ చైర్మన్ పాయం సత్యనారాయణ, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్‌తో పాటు పర్షిక సోమరాజు, కుంజా శ్రీనివాసరావు, కృష్ణ ప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు వ్యక్తుల బైండోవర్

దుమ్ముగూడెం : మండలంలోని పెద్దనల్లబల్లి, కేశవపట్నం, నర్సాపురం, నడికుడి గ్రామాలకు చెందిన ఐదుగురు నాటుసారా విక్రేతలను ఎక్సైజ్ పోలీసులు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేశారు. వీరు గతంలో నాటుసారా విక్రయిస్తూ పట్టుబడ్డారని, మళ్లీ నాటుసారా విక్రయిస్తుండటంతో అదుపులోకి తీసుకుని బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ అల్లూరి సీతారామరాజు తెలిపారు.

భీం ఆశయాలను కొనసాగించాలి


కరకగూడెం: భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆదివాసీలు


మణుగూరుటౌన్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: ఆదివాసీ ముద్దుబిడ్డ, పోరాట సమరయోధుడు కుమురం భీం ఆశయాలను కొనసాగించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గురువారం కుమురం భీం వర్ధంతి సందర్భంగా ప్రజా భవన్ నుంచి మణుగూరు అంబేడ్కర్ సెంటర్ వరకు బైక్ ర్యాలీతో వచ్చిన ఎమ్మెల్యే.. భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భీం ఆశయాలైన జల్ జమీల్ జంగల్ అనే నినాదం కోసం ఆదివాసులు ఐకమత్యంతో సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు ఆదివాసీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు గ్రామంలో ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో గురువారం కుమురం భీం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు కొమురం దామోదర రావు మాట్లాడుతూ.. ఆదివాసీల మనుగడ కోసం నైజాం ప్రభుత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసి, 12గ్రామాల్లో రాజ్యం ఏర్పాటు చేసిన వీరుడు కుమురం భీమ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సోయం కామరాజు, సహాయ కార్యదర్శి కణితి రాముడు, తునికి కామేష్, నూప సీతయ్య, సోయం కృష్ణా బాబు, కల్లూరి శేఖర్, మర్రం వెంకటేష్, కంగాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుండాల: కుమురం భీమ్ వర్ధంతిని గుండాలలో గురువారం తుడుందెబ్బ ఆధ్వర్యంలో వజ్జ ఎర్రయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంపిడి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ ముక్తి సత్యం మాట్లాడుతూ.. ఆదివాసుల కోసం ఎన్నో ఎదురుదెబ్బలు తింటూ తన జీవితాన్ని త్యాగం చేసిన వ్యక్తం కొమురం భీమ్ అని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఈసం పాపారావు, ప్రజాపంథా నాయకులు ఈసం శంకరన్న, న్యూడెమోక్రసీ నాయకులు కోరం సీతారాములు, ఈసం కృష్ణ, తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కోడెం వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి పూనెం శ్రీనివాస్, మోకాళ్ల కన్నయ్య, ఈసం సాంబయ్య, మండల అధ్యక్షుడు గోవింద నరసింహారావు, మండల ప్రధాన కార్యదర్శి చింత వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: ఆదివాసీల హక్కుల పోరాట యోధుడు కుమురం బీమ్ వర్ధంతిని గురువారం నిర్వహించారు. వీరాపురం క్రాస్ రోడ్డు వద్ద ఉన్న బీం విగ్రహానికి పలువురు ఆదివాసీల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలు ఆదివాసీ సంఘాల నాయకులు, ఉద్యోగులు పోలేబోయిన రవి, పోలేబోయిన కృష్ణయ్య, మలకం కుమారస్వామి, పోలేబోయిన మోహన్‌రావు, మైపతి తిరుమలరావు, సున్నం కృష్ణ, గోగ్గల నరసింహారావు, కలం సాంబమూర్తి పలువురు యువత తదితరులు పాల్గొన్నారు.


గుండాల: కుమురం భీం విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు


దుమ్ముగూడెం: కుమురం భీం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు